## బాధ్యతలు స్వీకరించక ముందే బదిలీ

- నిన్న వాణి.. నేడు సత్యనారాయణరెడ్డి
- ఒకే రోజులో ఇద్దరు మున్సిపల్ కమిషనర్లు


సత్యనారాయణరెడ్డి


వాణి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో ఒకే రోజు కమిషనర్ బదిలీ చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం వెలువడిన మున్సిపల్ కమిషనర్ల బదిలీలో తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి వాణిని కమిషనర్‌గా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధం కాగానే, శుక్రవారం సత్యనారాయణరెడ్డి అనే అధికారిని ఇక్కడ కమిషనర్‌గా నియమించారు. దీంతో వాణి కమిషనర్‌గా రాకముందే శుక్రవారం సత్యనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఒకే రోజులో కమిషనర్ బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. అలాగే, ఇబ్రహీంపట్నం సీఐగా వచ్చిన ఆంజనేయులు వారం రోజులు తిరుగకుండానే బదిలీ అయ్యారు. దీంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బదిలీల పరంపర కొనసాగుతున్నది.

## 111 జీవోపై ప్రజల్లో అపోహను తొలగించాలి

శాసనసభలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



షాబాద్, ఫిబ్రవరి 16 : 111 జీవోపై ప్రజల్లో ఉన్న అపోహను తొలగించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శుక్రవారం శాసన సభా సమావేశాల్లో కోరారు. గత ప్రభుత్వ హయాంలో 111జీవో రద్దు చేశారని, దీనిపై కొత్తగా మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నారన్నారు. ప్రజల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం జీవో రద్దు చేసిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని పార్టీలకు చెందినవారిని గౌరవిస్తూ అభివృద్ధి పనులను అప్పజెప్పిందని, కాంగ్రెస్ ప్రభుత్వమూ అందరిని గౌరవించేలా అభివృద్ధి పనులను ఇవ్వాలన్నారు. దీనిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యే యాదయ్య చెప్పిన అంశాలన్నీ నోట్ చేసుకున్నామని, ఆయా శాఖలకు పంపిస్తామని సమాధానమిచ్చారు.



కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న టీఎన్‌జీవోస్ ఉద్యోగులు


ఆమనగల్లులో హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారిపై మానవహారాన్ని నిర్మించి నిరసన తెలుపుతున్న కార్మికులు

# నిరసనల హోరు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ఉమ్మడి జిల్లాలో నిరసనలు హోరెత్తాయి. మహిళలకు ఫ్రీ బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయని నిరసనలు వెల్లువెత్తగా, కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని భారీ ర్యాలీలు తీశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయొద్దని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కొండాపూర్ ప్రభుత్వ దవాఖానలో వేతనాలు చెల్లించడం లేదంటూ ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని పలు సంఘాలు హెచ్చరించాయి.

## ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేయొద్దు

**వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో ప్రభుత్వ ఉద్యోగుల నిరసన**

వికారాబాద్, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు ప్రభుత్వ ఉద్యోగులపై గొడ్డలి పెట్టు లాంటివని.. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయొద్దని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎం.శివకుమార్ మాట్లాడుతూ సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి అజ్మత్ పాషా, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింలు, కోశాధికారి రమేశ్, వికారాబాద్ తాలూకా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ అరుణ కుమారి, జాయింట్ సెక్రటరీ ఉమెన్ శ్రావణి, జాయింట్ సెక్రటరీలు హీరలాల్, సాయి కుమార్, ఆఫీస్ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెలలు గడుస్తున్నా.. జీతాలిస్తలేరు..

**రంగారెడ్డి జిల్లా దవాఖానలో కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన**

కొండాపూర్, ఫిబ్రవరి 16 : నెలలు గడుస్తున్నా.. జీతాలిస్తలేరంటూ.. శుక్రవారం కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ విభాగం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. డిసెంబర్ నుంచి జనవరి వరకు జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రవణ్ యాదవ్, రాజు, భాగ్య, మల్లేశ్వరీ, అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జిల్లా దవాఖానలో విధులను బహిష్కరించి ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

## కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు పట్టణ వీధుల గుండా భారీ ర్యాలీ తీస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈపీఎస్, పెన్షన్ నెలకు రూ.10 వేలకు పెంచాలని, సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కానుగుల వెంకటయ్య, గొర్ల కాపరుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు యాదమ్మ, సంగీత, కేవీపీఎస్ జిల్లా నాయకులు దుబ్బ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డయ్..

**పెద్దేముల్‌లో ఆటో డ్రైవర్ల ధర్నా.. ఫ్రీ బస్సు పథకంతో బతుకులు ఛిద్రం**

**ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్**

పెద్దేముల్, ఫిబ్రవరి 16 : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొన్న ఫ్రీ బస్సు నిర్ణయంతో లక్షలాది ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాష్ట్ర ఆటో జేఏసీ పిలుపు మేరకు పెద్దేముల్‌లో రోడ్డుపై ధర్నా చేశారు. ఫ్రీ బస్సు నిర్ణయంతో ఆటోడ్రైవర్ల బతుకులు ఛిద్రమయ్యాయని, రాష్ట్రంలో ఇప్పటి వరకు సుమారు 25 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు నిత్యం రూ. 6, 7 వందలు సంపాదిస్తే.. ప్రస్తుతం రెండు వందలు కూడా రావడం లేదన్నారు. ఫ్రీ బస్సు పథకాన్ని రద్దు చేయాలని, లేదంటే నెలకు రూ.15 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. ఆటోవాలాల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో పెద్దేముల్ మండల ఆటో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్మీది శ్రీనివాస్, సలహాదారుడు ఆర్.మల్లప్ప, ఆటో వెల్ఫేర్ అసోసియేషన్ మండల వైస్ ప్రెసిడెంట్ ఎండీ.మోజం, కార్యదర్శి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దేముల్ మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

# మార్కెట్‌లో వ్యాపారులదే రాజ్యం

- మార్కెట్‌లో వారు చెప్పిందే ధర.. లేదంటే కొనుగోలుకు నిరాకరణ
- తక్‌పట్టీలకు బదులు బుక్కచిట్టీలు
- మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సందర్శించినా మారని తీరు
- ఏండ్లుగా కొనసాగుతున్న అధికారుల తీరు ప్రశ్నార్థకం

పరిగి, ఫిబ్రవరి 16 : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర లభించక అన్నదాతలకు నిరాశే మిగులుతున్నది. పరిగి మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిందే ధర, అధికారులు సైతం వ్యాపారులకు వత్తాసుగా పలుకుతుండడంతో రైతులకు నష్టం జరుగుతున్నది. జనవరి 27వ తేదీన వేరుశనగకు మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఆందోళన చేయగా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి పరిగి మార్కెట్‌ను సందర్శించినా వ్యాపారుల తీరు మారడం లేదు. 20 రోజుల క్రితం అధికారులు ఇచ్చిన హామీలేవీ అమలు కాకపోవడం గమనార్హం.

**వ్యాపారులదే పెత్తనం..**

పరిగి వ్యవసాయ మార్కెట్‌లో మొత్తం 58 మందికి కమీషన్ ఏజెంట్ల లైసెన్స్‌లు ఉండగా, 56 మంది లావాదేవీలు కొనసాగిస్తున్నారు. మార్కెట్‌లో 14 మంది ఖరీద్‌దారులు ఉండగా, కేవలం నలుగురే వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తారు. పరిగిలో శుక్రవారం వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు జరుగుతాయి. జనవరి 26వ తేదీన సెలవు రోజు కావడంతో 27న పరిగి మార్కెట్‌కు పెద్ద ఎత్తున వేరుశనగను తీసుకురాగా అంతకు ముందు వారం కంటే తక్కువ ధరకు కొనుగోలు చేయాలని వ్యాపారులు నిర్ణయించడంతో రైతాంగం ఆందోళన చేసింది. జనవరి 27వ తేదీన 340 మంది రైతులు 4,118 క్వింటాళ్ల వేరుశనగ తీసుకొచ్చారు. ఫిబ్రవరి 2న 1,365 క్వింటాళ్లు, 9వ తేదీన 1,776 క్వింటాళ్ల వేరుశనగను రైతులు తీసుకొచ్చారు. పరిగి, దోమ మండలాలతోపాటు పక్కనే ఉన్న కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట మండలంలోని పలు గ్రామాల రైతులు సైతం పరిగి మార్కెట్‌కు వేరుశనగ తీసుకొచ్చారు. కొనుగోలుదారులు నలుగురే కావడంతో ఒకరితో ఒకరు మాట్లాడుకొని 'కన్ను కొట్టి కచ్చా మాల్' పేరిట తక్కువ ధర నిర్ణయిస్తున్నారు. మరోవైపు తరుగు పేరిట ఒక బస్తా(30 కిలోల) వేరుశనగకు కిలో 300 గ్రాముల వరకు తీస్తుండడం విడ్డూరం. టెండర్ సమయంలో నిర్ణయించిన ధర కంటే క్వింటాలుకు సుమారు రూ.100 తక్కువగా చెల్లిస్తున్నారని రైతులు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తక్‌పట్టీల స్థానంలో బుక్కచిట్టీలపై వివరాలు రాసి ఇస్తూ ద్వారా రైతులను మోసం చేస్తున్నారు. మరోవైపు ఏజెంట్లు 5శాతం కమీషన్ వసూలు చేస్తున్నా అధికారుల చర్యలు శూన్యం.

**నాలుగేండ్లకుపైగా పాతుకుపోయిన అధికారులు..**

పరిగి మార్కెట్‌లో పని చేస్తున్న కార్యదర్శి, సూపర్‌వైజర్ సైతం నాలుగేండ్లకుపైగా ఇక్కడే కొనసాగుతుండడంతో వారు రైతుల సంక్షేమం కంటే వ్యాపారులు బాగుంటే చాలనే విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడుతున్న సందర్భంలో మార్కెట్ కార్యదర్శి మాట్లాడిన తీరుకు ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, డిప్యూటీ డైరెక్టర్ పద్మహర్ష మార్కెట్‌ను సందర్శించి మార్కెట్ కార్యదర్శి తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

**నిరుపయోగంగా వే బ్రిడ్జి..**

పరిగి మార్కెట్ యార్డులో వే బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో తూకాల విషయంలో తమకు జరుగుతున్న అన్యాయానికి తెర పడుతుందని రైతాంగం భావించారు. కానీ నాలుగున్నర ఏండ్లుగా వే బ్రిడ్జి ఉపయోగంలో లేకపోవడం గమనార్హం.


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న వేరుశనగ రైతులు, (ఇన్‌సెట్‌లో తెల్లకాగితంపై రాసిచ్చిన తక్‌పట్టీ)(ఫైల్)

**అమలుకు నోచని ఉన్నతాధికారుల హామీలు..**

వేరుశనగ రైతుల ఆందోళన నేపథ్యంలో పరిగి మార్కెట్‌ను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, డిప్యూటీ డైరెక్టర్ పద్మహర్షలు కమీషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. వే బ్రిడ్జిని మరమ్మతు చేయించి ఉపయోగంలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చి 20 రోజులు దాటినా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. తక్‌పట్టీలు తప్పనిసరిగా ఇవ్వాలని, వారానికి రెండు రోజులు శుక్రవారం, మంగళవారం బీట్లు నిర్వహించి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. తూకాలు సాయంత్రం లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులు ప్లాట్‌ఫారంపై పోస్తే తరుగు తీయరాదని, కమీషన్ 2 శాతం కంటే అధికంగా తీసుకోరాదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలలో ఏవీ అమలు కాకపోవడం గమనార్హం.

